# అమ్మా..నాన్నొద్దే!

-కోలపల్లి ఈశ్వర్

''చందమామ రావే...జాబిల్లిరావే..కొండెక్కిరావే..గోగుపూలు తేవే..పల్లకిలో రావే..పాలబువ్వ తేవే''

ఏడేళ్ల నిమ్మి ఆరుబయట వెన్నెట్లో కూర్చుని వుంది. మూడేళ్ల పాపలా మారాం చేస్తూ...వసంత నోటికి అందిస్తున్న గోరుముద్దల్ని తింటూ...ఆమె పాడే పాట మైమరచిపోయి వింటోంది.

హఠాత్తుగా పాట ఆపి లేచింది వసంత-గేట్ తీసుకొని లోపలికి వస్తున్న శ్రీహర్ష వైపు సుడిగాలిలా దూసుకెళ్లి అతని చేతిలోని సూట్‌కేసుని అందుకుంది.

''నిమ్మీ! నాన్నొచ్చారే...''సంతోషం, సంభ్రమం ముప్పిరిగొన్న స్వరంతో అరిచినట్టుగా అని భర్త వెనకే ఇంట్లోకి దారితీసింది. శ్రీహర్ష అలసటగా సోఫాలో కూర్చున్నాడు. వసంత సూట్‌కేస టీపాయ్ మీద వుంచి చెప్పింది.

''వుండండి. స్టౌమీద నీళ్లు పడేసి వస్తా. వేడి వేడి నీళ్లతో స్నానం చేసేస్తే బడలికంతా పోతుంది.''

అని చెప్పి ఆమె వంటింట్లోకి వెళ్లింది.

వసంత నెల్లూరులో ఎల్.ఐ.సి ఆఫీసులో టైపిస్ట్‌గా చేస్తోంది. శ్రీహర్ష విశాఖలో ఏదో ఆఫీస్‌లో క్లెరికల్ కేడర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగరీత్యా ఆమె ఇక్కడ అతనక్కడ. మధ్యతరగతి సంసారం. తప్పని ఎడబాటు. నెలకోసారి మాత్రం ఖచ్చితంగా వస్తుంటాడు.

శ్రీహర్ష టీపాయ్ మీద సూట్‌కేస ముందుకు లాక్కుని తెరిచాడు. ఈలోపు వసంత కిచెన్‌లోంచి వచ్చింది.

''పాపా!'' ఓ బరువైన పేకెట్ సూట్‌కేస లోంచి తీసి నిమ్మీని పిలిచాడు.

తండ్రి వచ్చాడన్న హడావుడిలో తల్లి లేచినపుడు ఆమె చీర కుచ్చిళ్లు తగిలి నేల మీద ఒలికిపోయిన అన్నాన్నే తదేకంగా చూస్తున్న నిమ్మీ- అతను పిలవడం వినపడి కూడా బదులు ఇవ్వలేదు.

''నిమ్మీ'' మళ్లీ పిలిచాడు.

నొసలు ముడివేసి విసుగ్గా లేచింది. నింపాదిగా నడుచుకు వెళ్లి తండ్రికి ఓ గజం దూరంలో నిలబడి ఏమిటన్నట్లు చూసింది.

''నీకేం తెచ్చానో చెప్పుకో చూద్దాం'' శ్రీహర్ష ఆ పేకెట్‌ని నిమ్మీకళ్లముందు ఆడిస్తూ అడిగాడు.

''డ్రెస్'' చెప్పింది.

''కాదు''

''బొమ్మ'' కాస్త చిరాగ్గా చెప్పింది.

''ఊహూ''

ఇక గేస్ చెయ్యటం ఇష్టం లేనట్టు ఉదాసీనంగా వూరుకుంది.

నిమ్మీ ఏమైనా చెబుతుందేమో అని కాసేపు చూసి ఆ పిల్ల నుంచి రెస్పాన్స్ లేకపోయేసరికి శ్రీ హర్షే కవర్ విప్పి ఓ వస్తువును అపురూపంగా బయటకు తీసాడు.

''అరె! కెమెరా! అయినా ఇది దానికెందుకండీ!'' వసంత ఆశ్చర్యంగా అడిగింది. ''వసంతా! నేను లాస్ట్ టైమ్ వచ్చినపుడు నితిన్ అనే ఓ ఫెంటాస్టిక్ ఫోటోగ్రాఫర్ని దూరదర్శన్‌లో ఇంటర్వ్యూ చేశారు గుర్తుందా?''

వసంత ఆలోచనలో పడింది.

''అవును! ఆ ఫోటోగ్రాఫర్ వయసు జస్ట్ ఆరేళ్ళు. అయినా అనుభవజ్ఞుడిలా తీశాడు ఫోటోలు. ఆ బాబు తీసిన చాలా ఫోటోల్ని డిస్ ప్లే చేసి చూపారు. ఎంత అద్భుతంగా ఉన్నాయో అవి! రియల్లీ...హి ఈజ్ గిఫ్టెడ్ చైల్డ్.

''గుర్తొచ్చింది కదూ? ఆ బుల్లి ఫోటోగ్రాఫర్ని చూస్తూ మన బుజ్జిపాప ఏమందో కూడా గుర్తు చేసుకోమరి.''

వసంతకు చప్పున జ్ఞాపకాని కొచ్చింది. నితిన్ని చూస్తూ ''అదేం గొప్ప! కెమెరా వుంటే నేనూ అంతకన్నా బాగా తీస్తా'' అంది నిమ్మి ఆరోజు.

శ్రీహర్ష చెప్పాడు ''అందుకేనోయ్ నేనీ కెమెరా తెచ్చింది. పిల్లల్లో నిగూఢంగా కొన్ని శక్తులుంటాయ్. వారి వెన్ను తట్టి వాటిని వెలికి తీస్తే అద్భుతాలు జరుగుతాయ్. నితిన్ తల్లిదండ్రులు అతన్ని అంతగా ప్రోత్సహించబట్టే గదా ఆరేళ్ళ ఆ చిన్నారి మనకో 'వండర్ బోయ్' అయ్యాడు. ఏమో నిమ్మి కూడా మరో నితిన్ అవుతుందేమో!''

దూరంగా నిలబడి వున్న నిమ్మిని చప్పున ఒళ్ళోకి లాక్కుని ముద్దుపెట్టుకుని కెమెరా చేతికిచ్చాడు.

నిమ్మి దాన్ని అటు ఇటు తిప్పి చూసింది. ''సాయంత్రం ఫిల్మ్ లోడ్ చేసి..ఎలా తియ్యాలో నేనేర్పుతాలే' చెప్పాడు శ్రీహర్ష.

నిమ్మి తలాడించి కెమెరాను నిరాసక్తంగా అక్కడేవున్న ఓ టేబుల్ మీద పడేసి వెళ్ళిపోయింది. నిమ్మి వెళుతున్న వైపే రెప్పలార్పకుండా చూసింది వసంత.

★★★

''మొదటి ఫోటో అమ్మనీ నన్ను కలిపి తియ్యి''

శ్రీహర్ష..కెమెరా లెన్స్..డిస్టెన్సూ అడ్జెస్ట్ చేసి నిమ్మినక్కడే నిలబెట్టి/ఎక్కడ క్లిక్ చెయ్యాలో చెప్పి వసంత పక్కగా వెళ్లి నిలబడ్డాడు.

నిమ్మి లెన్సులోంచి పక్కపక్కనే నిలబడ్డ ఆ యిద్దర్నీ చూస్తోంది.

''ఒక్క క్షణం ఆగు నిమ్మీ'' శ్రీహర్ష అలా చెప్పి వసంత జడ తీసి ముందుకు వేశాడు. ''ఇంత పెద్ద జడ ఫోటోలో పడనీ వోయ్''అన్నాడు.

వసంత సిగ్గుగా నవ్వింది.

శ్రీహర్ష ఆమెకు మరింత దగ్గరగా జరిగి భుజం చుట్టూ చెయ్యి చుట్టి నిమ్మికి చెప్పాడు ''మేం రెడీ''

నిమ్మి చప్పున అక్కడ్నుంచి పక్కకెళ్ళిపోయి దూరంగా నిలబడింది.

వసంత, శ్రీహర్ష ముఖముఖాలు చూసుకున్నారు. శ్రీహర్ష మెల్లగా నిమ్మి దగ్గర కెళ్లి ఆమె పక్కనే మోకాళ్ళ మీద కూర్చుని అడిగాడు. ''ఏమ్మా తియ్యలేదు. చేతకాదనా? క్లిక్ కొట్టేయ్. ఫోటో వస్తే వస్తుంది. లేకుంటే రాదు. ఇంకోసారి తీసుకుంటాం. అంతేగా!''

''అందుక్కాదు'' చెప్పింది కోపంగా.

''మరెందుకు?''

''మీ యిద్దర్నీ కలిపి నేను ఫోటో తియ్యను''

శ్రీహర్ష షాక్ తిన్నా తమాయించుకుని అడిగాడు. ''పోనీ..నన్నొక్కడ్నే తీస్తావా?''

''తియ్యను'' తల అడ్డంగా తిప్పింది.

''మరి అమ్మ నొక్కత్తినే తీస్తావా?''


నిమ్మి కళ్ళు వెడల్పు చేసి తల్లినే తదేకంగా చూసింది. చూసి చెప్పింది ''ఆ..అమ్మనొక్కదాన్నే తీస్తా.''

మనసులోని చేదుకు మాటలలో తీపి అద్దుతూ అన్నాడు.

''ఓ.కే. నీ యిష్టమమ్మా- వసంతా! నిలబడు..నిమ్మి ముందు నిన్నే తీస్తుందట. ఎంతయినా అమ్మ కూతురు కదా. నన్ను తరువాత తీస్తుందిలే.''

నిమ్మి వెంటనే చెప్పింది ''తరువాత కూడా నీ ఫోటో తియ్యను. రీలంతా అమ్మనే తీస్తాను.''

నిమ్మి చెంప ఛెళ్ళుమంది. నిప్పులు చెరుగుతూ చూసింది వసంత. ''ఏమిటే వాగుతున్నావ్. అడ్డగాడిద కొచ్చినట్టు ఏడేళ్ళు వచ్చినా... బుజ్జి పాపలా ముద్దు చేస్తున్నానే...అదే నేను చేసిన తప్పు. ఆయనెవరనుకున్నావే..మీ నాన్న ఆ కెమెరా తెచ్చింది. నేను కాదే, ఆయన! నీ కోసం అంతదూరం నుండీ పట్టుకొచ్చారు దాన్ని! తియ్యవే.. ముందు ఆయన ఫోటోనే తియ్. లేదంటే చంపేస్తా..''



''వసంతా!'' హిస్టీరియా పేషెంట్‌గా వూగిపోతున్న వసంతను గట్టిగా పట్టుకుని కుదిపి పారేశాడు శ్రీహర్ష. ''ఏమిటి వసంతా ఇది! చిన్నపిల్లలా! పసిపిల్లమాటలకు ఇంత రాద్ధాంతమా? నిమ్మి నా ఫోటో ఎందుకు తియ్యదు? తీస్తుంది. రా నాన్నా నిమ్మీ. అమ్మకు కోపమొచ్చింది గాని ముందు నన్నేట తియ్.''

నిమ్మి ఏడుస్తున్న వసంతనూ, ఆమెను పట్టుకుని తల నిమురుతున్న శ్రీహర్షనూ మార్చిమార్చి చూసింది! చూసి కెమెరా ఎత్తి నేలకేసి కొట్టి పెద్దగా అరిచేసింది.

''నువ్వంటే నాకిష్టం లేదు. నేను తియ్యను''

వసంత అలాగే శ్రీహర్ష గుండెల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ''మీకు తెలీదండీ...నిమ్మికి మీరంటే ద్వేషం. నెలంతా హాయిగా గడిపేస్తుంది. మీరొస్తున్నారని తెలిస్తే చాలు దాని మూడ్ మారిపోతుంది. ఎందుకో అప్‌సెట్ అవుతుంది. అసలది అప్పుడప్పుడు నిద్రలో ఏమని కలవరిస్తుందో చెప్పమంటారా? చెబితే మీ గుండె ఆగిపోతుంది. నే చెప్పను, చెప్పలేనండీ''

''వద్దులే- వసంతా! నాకూ వినాలని లేదు. వూరుకో, వూరుకోమంటుంటే''

ఆమెను ఓదారుస్తూ....ఆలోచిస్తూ....అలాగే వుండిపోయాడు శ్రీహర్ష-చాలాసేపటి వరకూ.


★★★


''మా నాన్నంటే నా కిష్టం లేదు. అసహ్యం''

డీప్ స్లీప్‌లో వున్న నిమ్మి ట్రాన్స్‌లో మాట్లాడే మాటల్ని జాగ్రత్తగా టేప్ చేస్తున్నాడు శంతన్.

''ఎందుకని?''

''మా నాన్నొస్తే చాలు..అమ్మ నాతో ఆటలాడదు. నాకోసం పాటలు పాడదు. రోజులా అన్నం తినిపించదు.




కథలు చెబుతూ నిద్రపుచ్చుదు''

''ఆహా..మరేం చేస్తుంది?''

''ఎప్పుడూ నాన్నతోనే ఉంటుంది. నా కన్నం తినిపించడం మానేసి నాన్నకు తినిపిస్తుంది. నాతో అస్సలు మాట్లాడదు. నాన్నతో అయితే ఒకటే కబుర్లు. ఏమడిగినా విసుక్కుంటుంది. రాత్రి పూట నన్ను నిద్రపుచ్చేసి గప్‌చిప్‌గా నాన్నగదిలోకి వెళ్ళిపోతుంది. ఒక్కోసారి నాకు మెలుకువొచ్చి చూస్తే నా పక్కన అమ్మ కన్పించదు. చుట్టూ చీకటి! ఎంత భయమేస్తుందో-బూచాడొస్తాడేమోనని గట్టిగా కళ్ళు మూసుకుని కదలకుండా పడుకుంటాను.''

''అంతేనా!''

''ఊహు..ఇంకా ఒక్కోసారి అమ్మా నాన్న లిద్దరూ నన్ను పక్కింటి ఆంటీ దగ్గర వదిలేసి సినిమా కెళ్ళిపోతారు. అప్పుడు నాకెంత ఏడుపొస్తుందో. నాన్నని చంపెయ్యాలన్పిస్తుం ది.''

''తప్పుకదూ!''

''ఏం కాదు! నాన్నలేకపోతే అమ్మ నాతోనే ఉంటుంది. రాత్రిపూట నన్ను ఒంటరిగా వదిలేసి నాన్నగదిలోకి వెళ్ళదు.''

శంతన్ టేప్ రికార్డర్ ఆఫ్ చేసి లేచాడు. అప్పటివరకూ నిమ్మి మాటల్ని శ్రద్ధగా విన్న శ్రీహర్ష...వసంత వైపు సాలోచనగా చూసాడు.

''మిస్టర్ శ్రీహర్షా..విన్నారుగా-ఆ చిన్ని గుండెలో రేగే సంఘర్షణ. సో..మీ బేబీ మిమ్మల్ని హేట్ చెయ్యడానికి కారణం మీ ప్రవర్తనే.''

వసంత నొచ్చుకున్నట్టుగా చూసింది. ''డ్యాక్టర్..గవర్నమెంట్ సర్వెంట్స్ పరిస్థితి మీకు తెలుసు. ఆయనెక్కడో విశాఖలో.. నేనీ మారుమూల- నెలకొక్క సారి కలుసుకునే మేం ఆ మాత్రం ఆనందాన్ని అనుభవించడం కూడా తప్పంటారా?'' ఆమె కళ్ళలో నీళ్ళు.

''అది మీకు, నాకు తప్పుగాకపో వచ్చు. కానీ ఈ బేబీ దృష్టిలో అదో ఘోరమైన నేరం.''

''ఏడేళ్ళు డ్యాక్టర్ దానికి...అయినా ఇంకా నా గుండెమీదే నెలల పాపలా పడుకోబెట్టుకుని జోకొడుతుంటాను. వెండిగిన్నెలో అన్నం కలిపి పసిబిడ్డకు పెట్టినట్టు గోరుముద్దలు పెడుతుంటాను. అది ఏది కావాలంటే అది.....క్షణాల్లో అమరుస్తాను. ఒక్కగానొక్క సంతానమని అరచేతుల్లో దాని పాదాల్ని మోస్తూ కళ్ళలో పెట్టుకు పెంచుతున్నా.......''

వసంత మాటల్ని అడ్డుకుంటూ అన్నాడు డ్యాక్టర్.

''అదే మీరు చేసిన పొరపాటు. శృతిమించిన గారాబం ఆమె నలా తయారుచేసింది. మీకు తెలీదు.. రోజూ తల్లి గుండెల మీద పడుకునే పాప..వున్నట్టుండీ ఓ రోజు ఒంటరిగా చీకట్లో పడుకోవలసి రావడాన్ని ఎంతో దురదృష్టంగా భావిస్తుంది! తనతో అనుక్షణం ఆడి పాడే అమ్మ...వున్నట్టుండీ..తనను నిర్లక్ష్యం చేసి మరో వ్యక్తిని ముద్దు చేసే దృశ్యం ఆమెకు నరకాన్ని చూపిస్తుంది.''

''డ్యాక్టర్...ఎప్పుడో ఒక్కరోజు అలా జరిగితే..... నెలలో మిగతా ఇరవై ఎనిమిది రోజుల ప్రేమా.....''

''చూడండి...మనం రోజూ అన్నం తింటున్నా మని...ఓ రెండు రోజులు ఆపేస్తే....తట్టుకోగలమా! నో...ఇదీ అంతే''

శ్రీహర్ష అప్పటికి కల్పించుకుని అడిగాడు ''డ్యాక్టర్..మరి దీనికి సొల్యూషన్ ఏమిటంటారు.''

''ఒక్కటే.....మీరో నెలపాటు మీ ఉద్యోగానికి శెలవ్ పడేసి మీ పాపతో గడపండి. తల్లిని మరిపించేటంత ప్రేమ చూపించండి. మీ మీద ఇష్టం పెరిగేలా నడుచుకోండి.''

''ఓ.కె. డ్యాక్టర్! ఐ విల్ ట్రై మై లెవెల్ బెస్ట్- నా పాప నా కోసం పలవరించి పో యేంతటి ప్రేమను దానికి పంచిపెడతా ను''

''బెస్టాఫ్ లక్''-చెప్పాడు డ్యాక్టర్.

★★★


కెమెరా మెళ్ళో వేసుకుని కంటికి కనబడ్డ వాటన్నిటినీ క్లిక్ చేస్తోంది నిమ్మి. తండ్రితో మాట్లాడ్డం అసలు మానేసింది. శ్రీహర్ష బ్రతిమాలినా అతనితో ఎక్కడికి వెళ్ళటం లేదు.

''చూశారా! ఇది మనిషి కాదండీ..దయ్యం. మీరు శెలవ్ పెట్టడం శుద్ధ దండగ-వెళ్ళిపోండి-ఈ పిశాచితో నేనెలాగో వేగుతాను.''

తల్లి మాటలు నిమ్మి మౌనంగా వింటోంది. ఈ నాన్న వెళ్ళేదాకా అమ్మింతే. తన్ను తిడుతుంది, కొడుతుంది కూడా! నాన్న వెళ్ళిపోతే అమ్మ మామూలు మనిషవుతుంది. తన్ను లాలిస్తుంది. ఒళ్ళో పడుకోబెట్టుకుని కథలు చెబుతుంది... ఏమిటో సారి.. నాన్న..ఎంతకూ వెళ్ళడే!

ఆరోజు తల్లి ఒంటరిగా వంట చేస్తున్నప్పుడు వెళ్ళి అడిగింది. ''నాన్నీసారి ఇంకా వెళ్ళలేదేం?''

వసంతకు చెర్రుమంది. ''వెళ్ళడే.



## అక్షయ్ డైలమా!

అక్షయ్‌కుమార్ మళ్ళీ డైలమాలో పడ్డాడు. రవీనాను వదిలాక కెరీర్ గ్రాఫ్ తగ్గుముఖం పట్టడంతో, ఆమెను వదులుకుంటే తను తెరమరుగయిపోయే పరిస్థితి వస్తుందేమోనన్న భయం కలిగింది అతడికి. అందుకే ఏప్రిల్, మేలలో అనుకుంటున్న, 'నిపుణికాతో పెళ్ళి ప్రస్తుతానికి వాయిదా వేసాడని వినికిడి. ఈ విషయమై 'పునీత్ ఇస్సార్' అనే ఆర్టిస్టుని కదిలిస్తే ఆయన నిపుణికను పొగుడుతూ ''నాని చాలా అందమైనదేకాదు, మంచి మనసు కలిగిన అమ్మాయి. ఆమెకు భర్తకావడమే ఏ మగాడికైనా దేవుడిచ్చిన వరం అవుతుంది. అక్షయ్ ఆమెను వదులుకుంటే అతడంత దురదృష్టవంతులు ఈ ప్రపంచంలో మరెవ్వరూ ఉండరు'' అన్నాడు. అంటే ఆయనకూ అక్కీ డైలమా అర్థమయిందేమో?! అందుకే ఇలా సైకాలజీ మీద దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. మరి అక్షయ్ 'అదృష్టదేవత' వైపు వెళ్తాడా లేక 'దేవుడిచ్చిన వరం' అందుకుంటాడా అన్నది ప్రస్తుతం బాలీవుడ్‌లో మిలియన్ డాలర్స్ క్వశ్చన్‌లా చర్చింపబడుతోంది.

-జె.వి.బాబు

ఇక వెళ్ళనే వెళ్ళడు మీ నాన్న. ఇక్కడ నాతోనే ఇలాగే వుండిపోతాడు. సరేనా! అంతక్కావలిస్తే నువ్వేపో ఎక్కడికైనా''

శ్రీహర్ష రక్తాన్ని రంగరించుకు పుట్టిన నిమ్మి అతన్ని ద్వేషించ డం-అతని భార్యగా సహించలేక పోతోంది వసంత.

నిమ్మి తల్లి నలాగే చూసి అక్కడ్నుంచి నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది.

''ప్చ్..వసంతా..నీకెలా చెప్పాలి? నీకు ఆవేశమేగాని ఆలోచన లేదు. నీ మాటలుతో దానికింకా నామీద ద్వేషం పెరుగుతుందే గాని తరగదు.''

''పోనివ్వండి-దొంగ రాస్కెల్ -అది మిమ్మల్ని ప్రేమించకుంటే ఏం. మీకు నేనున్నా-నా ప్రేమ చాలండీ మీకు- నా ప్రేమ చాలు'' వసంత అతన్ని అల్లుకుపోయి భోరుమంది. ''యు ఆర్ టూ ఎమోషనల్ వసంతా!'' ఆమె తల నిమిరాడు శ్రీహర్ష.

''దూరం నుంచీ కెమెరా లెన్సు కళ్ళ కడ్డం పెట్టుకుని నిర్మిమేషంగా చూసిందా దృశ్యాన్ని నిమ్మి.

మెల్లగా ఆ పిల్ల దగ్గరకెళ్ళాడు శ్రీహర్ష. ''అమ్మ పిచ్చిదిరా. ఏదో అంటుందిలే. అవునూ..మనిద్దరం సాయంత్రం ఎగ్జిబిషన్ కెళ్దామా? అమ్మెందర్దు. నిన్ను తిట్టిందిగా.''

నిమ్మి మనసులో కాస్త స్థానం కోసం శత విధాల ప్రయత్నిస్తూ అడిగాడు. ఏ కళ నుందో ఏమో , చిత్రంగా ఒప్పుకుంది నిమ్మి-

శ్రీహర్ష గుండె ఆనందంతో ఒక్కక్షణం కొట్టుకోటం మానేసింది. విషయం విన్న వసంత ఉక్కిరి బిక్కిరైంది. నిమ్మికి తల దువ్వి, స్నానం చేయించి-చక్కగా ముస్తాబు చేసింది.

వెళుతూ వెళుతూ నిమ్మి వెనక్కొచ్చి కెమెరా తీసుకుంది.

''నాన్నా..ఈ ఫిల్మ్ అయిపోయింది.. ఇంకో టుందా?'' శ్రీహర్ష కెమెరాలోంచి పాత ఫిల్మ్ తీసి కొత్తది లోడ్ చేశాడు. ''అబ్బో..అప్పుడే రీలంతా అయిపోయిందంటే చాలా ఫోటోలు తీశావన్నమాట. రేపే డెవలప్ చేయించి, ప్రింట్స్ వేయిస్తా. వసంతా! ఇదిగో..ఇది దాచిపెట్టు'' పాత ఫిల్మ్ వసంత చేతికిచ్చాడు.

''అమ్మా! ఎగ్జిబిషన్లో నాన్న ఫోటో తీస్తా''

వసంత కళ్ళు తడితో మెరిశాయి. చప్పున నిమ్మిని ముద్దుపెట్టుకుంది. ''అదేవమ్మా నాక్కావల్సింది. నీలో ఈమార్పే-'' అస్పష్టంగా సణుక్కుంది.


''నాన్నా! ఈ ఎగ్జిబిషన్లో జయింట్ వీలుందా?''

''ఎందుకు లేదురా! వుంది.''

''మనం ఎక్కుదామా'' మెరుస్తున్న కళ్ళతో అడిగింది.

''తప్పకుండా'' శ్రీహర్ష చెప్పి వసంతతో అన్నాడు. ''వస్తామోయ్ వసంతా. ఇక నిమ్మి..నీ పార్టీ కాదు, నా పార్టీ''

తండ్రి వేలు పట్టుకుని గేటు దాటుతున్న నిమ్మిని



కళ్ళనిండుగా చూసుకుంది వసంత.

★★★

''నో...దాని పేరు నా దగ్గర ఎత్తొద్దు. నేను వినలేను. మరోసారి ఆ రాక్షసి గురించి చెప్పారం టే....వురేసుకు చస్తాను..వురేసుకు చచ్చిపోతాను.''

జుట్టు పీక్కుంటూ హిస్టీరిక్గా ఏడుస్తుంది వసంత-ఎంతయినా కన్నబిడ్డ.

తన గదిలోకి పారిపోయి తలుపులు మూసుకుంది.

బెడ్ మీద బోర్లాపడి పొగలి పొగలి ఏడ్చింది. దుఃఖం తీరాక సీలింగ్ కేసి కాసేపు బ్లాంక్గా చూసింది. తరువాత మెల్లగా లేచి వెళ్ళి టేబుల్ సొరుగు లాగి ఓ కవర్ అందుకుంది. కవర్ ఓపెన్ చేసి వణుకుతున్న చేతుల్తో ఓ ఫోటోని బయటకు తీసింది-ఓ చేత్తో దాన్ని కళ్ళ కెదురుగా పట్టుకుని మరో చేత్తో కళ్ళు మూసుకుంది.

నెమ్మదిగా కళ్ళకడ్డుగా వున్న చేతిని పక్కకు తొలగించి ఒక్కసారిగా చూసింది. ఫోటోవైపు-దాన్ని చూడ్డం అది వందోసారి. అయినా భయంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. గుండె వేగంగా కొట్టుకుంది.

శ్రీహర్ష నేల మీద వెల్లకిలా పడివున్నాడు. రన్నింగ్లో వున్న జయింట్ వీల్ పై భాగం నుంచి పడటంతో తల నేలకు కొట్టుకుని రెండుగా విచ్చిపోయింది. నిమ్మి అలా తన్నెందుకు నెట్టిందో అర్థం కాక అయోమయంగా చూస్తున్న కళ్ళు అలాగే ఆశ్చర్యంగా తెరచుకుని వున్నాయి. ఆ తెరచుకున్న కళ్ళలోంచి పగిలిన గుండె తాలూకు రక్తం ధారలుగా కారుతోంది.

వసంత కళ్ళు తీవ్రంగా చలించిపోతున్నాయి. అది జరిగి రెండు వారాలైనా ఇప్పుడే-ఇక్కడే జరిగినట్టు గడగడ వణికి పోతోందామె శరీరం.

''అమ్మా! ఎగ్జిబిషన్లో నాన్న ఫోటో తీస్తా''

నిమ్మి స్వరం....ఆ గది గోడల్లోంచి భయానకంగా ప్రతిధ్వనిస్తోంది. వసంత ఒక్క ఉదుటున లేచి గది తలుపులు తీసుకుని హాల్లోకి పరిగెత్తింది. అక్కడే సోఫాలో కూర్చుని వున్న తన తల్లి గుండెల్లో తలదాచుకుని బావురుమంది.

వసంతను పూర్తిగా ఏడవనిచ్చి చెప్పిందామె తల్లి ''వసంతా! నిమ్మి నీమీద ప్రేమతో పిచ్చిదై పోయిందమ్మా-పిచ్చివాళ్ళు చేసే పనులకు అర్థముంటుందా చెప్పు తల్లీ? భర్త నెలాగూ పోగొట్టుకున్నావ్. ఆ బిడ్డనన్నా దక్కించుకోమ్మా.''

''అటువంటి బిడ్డ నాకక్కర్లేద మ్మా''

''అయితే ఓ పని చెయ్యి. ఓసారి హాస్పిటల్ కెళ్ళి దాన్ని బెడ్ మీంచి ఎత్తి పై అంతస్థుమీంచి కింద పడెయ్''

''అమ్మా'' వినలేనట్టు చెవులు మూసుకుంది.

''బిడ్డ అక్కర్లేదన్నావ్గా'' వసంత మాట్లాడలేదు.

''వసంతా! చిన్నప్పుడు నువ్వోసారి కోపంతో నన్ను మిద్దిమెట్ల మీంచి తోసేశావ్. కాలు ఫ్రాక్చరై నెల్లాళ్ళు హాస్పిటల్లో వున్నాను. మీ నాన్న నిన్ను కొట్టాడని తెలిసి ఏడ్చాను. కానీ...నువ్వు నన్ను తోశావని ఏడవ లేదమ్మా నేను-ఆనాడు. అమ్మా! తప్పయిపో యిందని నువ్వు కన్నీళ్ళు పెట్టుకుంటే నిన్ను గుండెల్లోకి పొదుపుకొని ఓదార్చేనేకాని నిన్ను పల్లెత్తు మాటన్లేదు.''

వసంత నిశ్శబ్దంగా వింటోంది.

''నిమ్మి...తెలియని తనంతో.....తల్లిని తనకు దూరం చేస్తున్నాడన్న కసితో శ్రీహర్షని తోసేసింది. ఒకవేళ..శ్రీహర్ష చావకుండా వుండి వుంటే-నిమ్మిని తప్పకుండా క్షమించి వుండే వాడు.''

''నన్నిప్పుడేం చెయ్యమంటావమ్మా?''

''నిమ్మిని క్షమించు. తల్లి మీద ప్రేమతో తెలియక చేసిన పొరపాటుని అర్థం చేసుకుని దాన్ని ఆదరించు. నీ మీది ప్రేమ పిచ్చిగా మారి హాస్పిటల్ పాలై అపస్మారక స్థితిలో నిన్నే కలవరిస్తున్న ఆ వెర్రిదాన్ని ఆర్తిగా నీ గుండెలకు హత్తుకో....''

''అమ్మా.....''

బ్రతికుండగా తండ్రి నెలాగూ ప్రేమించ లేకపోయింది. కనీసం పోయిన తండ్రిమీద గౌరవం పెంచుకునేలా చెయ్యి. నీ క్షమతో అది తన తప్పు తెలుసుకుంటుంది. ఖచ్చితంగా పశ్చాత్తాపడుతుంది. లేదంటే ద్వేషంతో రగిలి రగిలి అదీ రాలిపోతుంది. ఎదురుపడ్డ ప్రతి వ్యక్తినీ కసిగా గొంతు నులిమే-సైకోగా మారిపోతుంది.

వసంత అలాగే కూర్చుని ఆలోచిస్తుంది.

గుమ్మంలో సవ్వడైతే తలెత్తి చూసింది. ఆమె తండ్రి లోపలికొచ్చి సోఫాలో కూలబడ్డాడు నిస్త్రాణగా.

''అది పలవరింపు కాదు వసంతా. నీ బిడ్డ నీకోసం..అమ్మా అమ్మా అని అలమటించి పోతోంది. దాన్ని చూస్తుంటే తండ్రిని చంపిన హంతకి గుర్తు రావటం లేదు. తల్లిప్రేమ కోల్పోయిన పాప కనిపిస్తోంది. కడుపు తరుక్కు పోతోందనుకో.''

వసంత చివుక్కున లేచి నిలబడింది. ''పదమ్మా! వెంటనే నేను నిమ్మిని చూడాలి.''

★